క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజల్లో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయం అద్భుతం



విద్యార్థులతో మాట్లాడుతున్న మేఘనా ఇంటర్నేషనల్ సీఈవో సీతారామస్వామి

సీతంపేట: పౌర గ్రంథాలయం అత్యాధునిక సౌకర్యాలతో అద్భుతంగా ఉందని మేఘనా ఇంటర్నేషనల్ కంపెనీ సీఈవో కె.సీతారామస్వామి అన్నారు. ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి అన్ని విభాగాలను చూశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ లైబ్రరీలో ఉన్న సదుపాయాలను ఆయనకు వివరించారు.

మాతృ మరణాల నివారణకు చర్యలు

మహారాణిపేట: మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. గురువారం రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల ఒక మాతృ మరణం సంభవించిందని, ఇక ముందు అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు చోటు చేసుకోకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, కేజీహెచ్ గైనిక్ విభాగాధిపతి డాక్టర్ వై.వి.నరసింహారావు, వైద్యులు డాక్టర్ ఉమావతి, బి.జ్యోతి, ఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ అధికారి బుద్ధా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రెంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా నగర సుందరీకరణ

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు
- బీచ్ కారిడార్‌లో పర్యటన



జోడుగుళ్లపాలెం బీచ్‌ను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర సుందరీకరణకు రాజీ లేకుండా బాధ్యతతో పని చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జోన్–2 పరిధి 9వ వార్డు తెన్నేటిపార్కు నుంచి జూ పార్క్ వరకు ఉన్న బీచ్ కారిడార్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చిలో జీ–20 సదస్సు జరగనున్న దృష్ట్యా విదేశీ ప్రతినిధులు అధిక సంఖ్యలో నగరానికి వస్తారని, వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం మన బాధ్యత అన్నారు. సముద్ర తీర ప్రాంతం వెంబడి నూతన హంగులతో బీచ్ కారిడార్‌ను తీర్చిదిద్దాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లకు ఆకర్షణీయమైన రంగులు వేయించాలని, బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ అలంకరణ పనులతో పాటు బీచ్‌లో ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. చెట్లను ట్రిమ్మింగ్ చేసి మంచి ఆకృతి కలిగే విధంగా తీర్చిదిద్దాలని చెప్పారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ శ్యాంసన్‌రాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీధర్, హార్టికల్చర్ మానిటరింగ్ ఆఫీసర్ చక్రవర్తి, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ లక్ష్మోజి, సహాయక ఇంజినీర్ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి రోగికి పింఛన్ అందజేత



గంగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి, సెక్రటరీ పార్వతి

అల్లిపురం: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్దకే వెళ్లి పింఛన్ అందించి మన్ననలు అందుకున్నారు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది. జీవీఎంసీ 33వ వార్డు, వుడ్‌యార్డు సచివాలయ పరిధిలో నివసిస్తున్న ఏనుగుపల్లి గంగమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ తైనాన సంతోషి, వెల్ఫేర్ సెక్రటరీ జాగరపు పార్వతి కేజీహెచ్‌కు వెళ్లి, లబ్ధిదారుకు పింఛన్ అందించారు. దీంతో గంగమ్మ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంజీఎం హైస్కూల్లో డీఈవో ఆకస్మిక తనిఖీ



హైస్కూల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లోని ఎంజీఎం ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి లంక చంద్రకళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్‌ను, సమ్మెటివ్ ప్రశ్నపత్రాల మూల్యాంకన విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధన ఉండాలన్నారు. ఆమె వెంట జిల్లా విద్యా శిక్షణ సంస్థ అధ్యాపకుడు గొట్టేటి రవి ఉన్నారు.

విశాఖ పోర్టు, పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుందాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : పరిశ్రమలకు కన్నతల్లి వంటి విశాఖపట్నం పోర్టు, పోర్టు హాస్పటల్ని కాపాడుకుందామని సిటూ పోర్టు యూనియన్ కార్యదర్శి బి. జగన్, వీడీఎల్‌బీ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జె. సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీన సీ–హార్స్ జంక్షన్ వద్ద చేపట్టనున్న నిరసన ప్రదర్శనకు సంబంధించి గురువారం సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కి ఇవ్వడాన్ని విరమించుకోవాలన్నారు. అలాగే పోర్టు స్థలాలు, స్టేడియం, కల్యాణమండపాలు ప్రైవేట్‌కి ఇవ్వరాదని, ఎస్ఎంపీ పేరిట బెర్తుల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ గత 38 ఏళ్లుగా వేలాది మంది కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్యాన్ని అందిస్తోందని, అటువంటి హాస్పిటల్‌ను క్రిసిల్ రిమ్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్(ముంబైకి పీపీపీ పద్ధతిలో కట్టబెట్టాలని నిర్ణయించి షిప్పింగ్ మినిస్ట్రీ అనుమతికి పంపించారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని ప్రైవేట్‌పరం చేయరాదని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, రామలింగేశ్వరరావు, త్రినాథరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే వాసుపల్లి జన్మదిన వేడుకలు



ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఎమ్మెల్యే కార్యాలయంలో రక్తదాన శిబిరం

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు గురువారం నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరిగాయి. వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, వాసుపల్లి అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎమ్మెల్యే కార్యాలయంలో వాసుపల్లిని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పలు వార్డుల కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నగర, జిల్లా, రాష్ట్ర నాయకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా కనకమహాలక్ష్మిని ఎమ్మెల్యే దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. వాసుపల్లికి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం ప్రసాదం అందజేశారు. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. సంస్థ ఆశ్రమ వాసులకు వాకర్స్, స్టిక్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సంస్థ గౌరవ సభ్యుడు భీశెట్టి వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు సూరాడ అప్పారావు, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, బాబ్జి, ముజీబ్‌ఖాన్, సత్తిబాబు పాల్గొన్నారు. ప్రేమ సమాజంలో వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు, పండ్లు, రొట్టెలు, బిస్కెట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేగుల నాయుడు, వడ్ల రామారావు, రాంబాబు, కృష్ణారెడ్డి, మోహన్, గణేష్, వెంకటేష్, శంకరరావు, కర్రి ధనలక్ష్మి, కొండా భవాని, శ్రీదేవి, శిరీష పాల్గొన్నారు. అంబికాబాగ్ రామాలయంలో వాసుపల్లిని పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మన్యాల శ్రీనివాస్ గజమాలతో సత్కరించారు. జిల్లా పరిషత్ జంక్షన్లో 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు ఆధ్వర్యంలో అను హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

మహారాణిపేట: ఎమ్మెల్యే వాసుపల్లికి గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కంచరపాలెం: పార్టీ కార్యాలయంలో 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ వాసుపల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం



మాట్లాడుతున్న డిమో బి.నాగేశ్వరరావు

మహారాణిపేట: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, దీనిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా లేదని, దీనిపై అందరికీ అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల కేరళ రాష్ట్రంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉందని చెప్పారు. లింగ నిర్ధారణ ఏదైనా ఆస్పత్రిలో అవుతుందన్న సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సమత, సత్యవతి, అధికారులు కె.ధర్మేంద్ర, వై.స్వర్ణలత, లక్ష్మి, మణికుమారి, బి.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే మురుగు ప్రవహించేదెలా?

- కాలువను శుభ్రం చేయండి
- సిబ్బందికి జోన్–4 జెడ్సీ శివప్రసాద్ ఆదేశం



జ్ఞానాపురం వద్ద గెడ్డలో చెత్తను చూపిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: కెనాల్‌లో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చెత్తను తొలగించి, శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. జోన్ పరిధిలోని జ్ఞానాపురం, బౌడారా రోడ్డులో రామకృష్ణ రైతుబజార్ వద్ద ఉన్న కెనాల్‌ను గురువారం ఆయన పరిశీలించారు. జ్ఞానాపురం నుంచి సముద్రం వరకు ఉన్న కెనాల్ చెత్తతో నిండి ఉండటంతో, ఇలా ఉంటే మురుగు నీరు ఎలా ప్రవహిస్తుందని జెడ్సీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ప్రశ్నించారు. పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను, షిల్ట్‌ను ఎప్పటికప్పుడు తీయించి, నీటిప్రవాహం సరిగ్గే జరిగేలా చూడాలని ఆదేశించారు. అన్ని వార్డుల్లో గెడ్డలు, కల్వర్టులను శుభ్రం చేయాలన్నారు. రోడ్డుపై చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు చెత్తను యార్డుకు తరలించాలని ఆదేశించారు.

దుకాణాల పరిశీలన

రహదారి పక్కన దుకాణాలను జెడ్సీ పరిశీలించి, ప్లాస్టిక్ కవర్లు అమ్మవద్దని వ్యాపారులకు సూచించారు. చెత్తను బయట పడేయకుండా దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తకు కూడా బిన్లు పెట్టి పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలన్నారు. సమయానికి జీవీఎంసీ సిబ్బందికి యూజర్ చార్జీలు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా క్రీస్తు జయంతి పాఠశాల వార్షికోత్సవం



వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ మల్లవరపు ప్రకాష్

డాబాగార్డెన్స్: నగరంలోని మహారాణిపేటలో గల క్రీస్తు జయంతి పాఠశాల 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విశాఖ అగ్ర పీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాష్, ఫాదర్ పాల మరశెట్టి రత్నకుమార్, సెయింట్ జోసెఫ్ ప్రావిన్షియల్ సుపీరియర్ రోజ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ కె. సువర్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ అరుళ్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్లాస్టికేతర వస్తు విక్రయాలకు ప్రత్యేక స్టాల్స్

జగదాంబ: మానవాళికి హాని కలిగించే ప్లాస్టిక్ నిషేధానికి వినియోగదారులు సహకరించాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ కోరారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల విక్రయాల కోసం జీవీఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రధాన మార్కెట్ల వద్ద ఆ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్టాల్స్‌లో 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉండే కవర్లు, జ్యూట్‌బ్యాగ్‌లు, వెదురు వస్తువులు, చెరకుతో చేసిన వస్తువులు విక్రయిస్తారని తెలియజేశారు. వాటిని ప్రజలకు అందుబాటు ధరల్లో అమ్మకాలు చేస్తారన్నారు. ముందుగా వీటిని పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు ఈ స్టాల్స్‌లో వస్తువులు సద్వినియోగం చేసుకుంటే అనారోగ్యం పాలవకుండా ఉంటారని, మూగజీవాలను కూడా కాపాడుకున్నవాళ్లం అవుతామని వివరించారు.

బాలుర గృహం సందర్శన

ఆరిలోవ: స్థానిక దీన్‌దయాళ్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహాన్ని గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం సందర్శించారు. బాలుర సంఖ్య, విద్యా, వసతి, భోజన సౌకర్యాల గురించి గృహం సూపరింటెండెంట్ వీరయ్యను అడిగి తెలుసుకున్నారు. వంట గది, భోజనాల గదిని పరిశీలించారు. వండిన అన్నం, కూరలు, సాంబారును రుచి చూశారు.

పోర్టును సందర్శించిన గిరిజన యువత



పోర్టులో గిరిజన యువత

దొండపర్తి: దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది గిరిజన యువత గురువారం విశాఖ పోర్టును సందర్శించారు. గిరిజన యువత ఎక్స్చేంజ్ ద్వారా విశాఖ కేంద్రంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా పోర్టు సందర్శన ఏర్పాటు చేశారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, ఎగుమతి, దిగుమతులు వంటి అంశాలను పోర్టు అధికారులు వారికి వివరించారు. పోర్టు సందర్శనకు అవకాశం కల్పించిన పోర్టు చైర్మన్ రామమోహనరావుకు గిరిజన యువత కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమీషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్ల చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమీషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శైలజ



భర్త విజయకుమార్‌తో శైలజ (ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్–విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్ – కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ – కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ పర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం.కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.